క్లుప్తంగా

ఆర్థిక సాయం



మృతుడి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న స్నేహితులు

లక్కవరపుకోట: పదోతరగతి వరకు తమతో కలిసి చదువుకుని అనారోగ్యంతో మృతిచెందిన కొట్యాడకి చెందిన కొట్యాడ విఘ్నేశ్వర రావు కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. ఎల్.కోట హైస్కూల్‌లో 1985-86 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు విఘ్నేశ్వరరావు కుటుంబానికి ఆదివారం రూ.10 వేల నగదు అందజేశారు. ముచ్చకర్ల నాగేశ్వర రావు, పెంటపల్లి రాంబాబు, పసుపురెడ్డి లక్ష్మణరావు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న రైల్వే న్యూకాలనీ వాసులు

గజపతినగరం: స్థానిక జాతీయ రహదారి వద్ద రైల్వే న్యూకాలనీ వాసులు ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రయాణికులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు, పాదచారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని నిర్వాహకులు చెప్పారు.

సీతారాంపురంలో మెగా వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ ప్రవర్ధన్, తదితరులు

గజపతినగరం: సీతారాంపురం గ్రామంలో గజపతినగరానికి శ్రీనివాస నర్సింగ్ హోమ్ మేనేజింగ్ డైరెక్టర్ బెల్లాన లక్ష్మీనరేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 120 మందికి వైద్యులు కంటి,చెవి,గొంతు తదితర వైద్యపరీక్షలతో పాటు బీపీ,సుగర్, హెచ్‌బీ పరీక్షలు చేశారు.అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్స చేసేందుకు ఇద్దరిని ఎంపిక చేశామని లక్ష్మీనరేంద్ర తెలిపారు. డాక్టర్ ఏ.ప్రవర్ధన్, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ జనార్దనరావు, హాస్పిటల్ మేనేజ్మెంట్ కో-ఆర్డినేటర్ జి.ప్రభ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



అధికారుల చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున్న మోడల్‌స్కూల్ విద్యార్థులు

మెరకముడిదాం: జాతీయ సైన్స్ డే సందర్భంగా జిల్లా కేంద్రం విజయనగరంలో శనివారం నిర్వహించిన క్విజ్, టాలెంట్ టెస్ట్ పోటీల్లో గర్భాం మోడల్‌స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జూనియర్ విభాగం క్విజ్ పోటీల్లో 7వ తరగతి విద్యార్థిని కె.జనని ప్రథమ స్థానంలో నిలవగా, సైన్స్‌ట్యాలెంట్ టెస్ట్‌లో 8వ తరగతి విద్యార్థి కె.వెంకటేష్ విజేతగా నిలవగా, 9వ తరగతి డి.వెంకటేష్ రన్నర్‌ప్‌గా నిలిచాడు. విద్యార్థులకు డీఈఓ మాణిక్యంనాయుడు ప్రశంసా పత్రాలు అందజేశారు.విద్యార్థులను మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ డి.వి.ఎస్.అరుణ, ఉపాధ్యాయ సిబ్బంది ఆదివారం అభినందించారు.

ప్రమాదకరంగా...



బీటలు వారిన భవనం పిట్టగోడ

లక్కవరపుకోట: మండలంలోని స్త్రీశక్తి భవనం పిట్టగోడ అత్యంత ప్రమాదకరంగా ఉంది. గోడ పూర్తిగాబీటలు వారి ఏ క్షణంలో కూలిపోతుందో తెలియని స్థితిలో ఉంది. గోడ ఇప్పటికే పెచ్చులు ఊడి రాలిపోతోంది ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి బీటలు వారిని గోడను తొలగించి, కొత్తగా నిర్మించాలని కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే వారు కోరుతున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

దత్తిరాజేరు: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో తాగునీటి బోర్ల మరమ్మతులు చేపడుతున్నామని పేర్కొన్నారు. 35 గ్రామ పంచాయతీల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే పంచాయతీ కార్యదర్శులకు కానీ, సచివాలయంలో కానీ సమాచారం అందిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బోర్లు పాడైతే తక్షణమే మరమ్మతులు చేయించి యథాస్థితికి తీసుకు వస్తామని తెలిపారు.

ఉచిత బస్సు... అంతా తుస్సు

- అటకెక్కిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం హామీ
- పథకానికి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించని ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న మహిళలు

చీపురుపల్లి నియోజకవర్గంలో మహిళా ఓటర్ల వివరాలు...	
మండలం	మహిళా ఓటర్లు
మెరకముడిదాం	23,315
చీపురుపల్లి	24,619
గరివిడి	28,179
గుర్ల	26,734



మెరకముడిదాం: అధికారం కోసం ఇష్టారీతిగా హామీలు ఇవ్వడం, ప్రజలను ప్రలోభ పెట్టడం...అధికారంలోకి వచ్చాక ఆ హామీలతో తనకేంటి సంబంధం అన్న ట్లు వాటిని అటకెక్కించడం సీఎం నారా చంద్ర బాబునాయుడు వెన్నతో పెట్టిన విద్య. 2014లో ప్రజలకు 600కు పైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు. మళ్లీ 2024 లోనూ అదేరీతిగా సూపర్ సిక్స్‌తో పాటు అనేక హామీలు ఇచ్చా రు. ప్రధానంగా మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు సూపర్ సిక్స్‌లో ఆడబిడ్డ నిధి, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, దీపం పథకం (ఉచిత గ్యాస్ సిలిండర్లు), తల్లికివందనం వంటి పథకాలను చేర్చారు. కూటమి అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచిపోయింది. ఇప్పటి వరకు ఈ పథకాల్లో ఏవీ అమలు చేయలేదు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభించేశామని ప్రభుత్వం చెప్పుకోవడానికే తప్ప క్షేత్రస్థాయిలో ఈ పథకం అమల్లో ఉందో లేదో పాలకులకే తెలియాలి. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ నెలకు రూ.1500 ఇస్తామని, మహిళలు ఆర్టీసీ బస్సుల్లో టిక్కెట్ తియ్యకుండానే ఎక్కడికైనా ప్రయాణించవచ్చని ఎన్నికల సమయంలో చంద్రబాబుతో పాటు కూటమి నాయకులు ఊదరగొట్టారు. అయితే తాజాగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025- 2026 వార్షిక బడ్జెట్‌లో ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి పథకాలకు పూర్తిగా మొండి చెయ్యి చూపారు. తల్లికి వందనం, దీపం పథకానికి కూడా పూర్తి స్థాయిలో నిధులు కేటాయించలేదు. ఉచి త బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి పథకాలకు రూపాయి కూడా కేటాయించకుండా తమకు ఈ పథకాలు అమలు చేసే ఉద్దేశం లేదని ప్రభుత్వం చెప్పకనే చెప్పినట్లుందని మహిళలు మండిపడుతున్నారు.

అధ్యయనం చేశారా...?

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ఇదిగో రేపే ప్రారంభించేస్తామన్నట్లు మీడియా ద్వారా తరచూ లీకులు ఇచ్చేది. ఒక్కో మంత్రి ఒక్కో ముహూర్తం తేదీని ప్రకటించేశారు. ఒకరు 2024 ఆగస్టు 15న ప్రారంభించేస్తామని చెబితే, మరికొందరు మంత్రులు దసరా,దీపావళి, సంక్రాంతి అంటూ తేదీలు మార్చుతూ వచ్చారు. ఆఖరికి ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించింది. రవాణాశాఖ మంత్రి చైర్మన్‌గా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి, హోంమంత్రి సభ్యులుగా సబ్ కమిటీ ఏర్పాటైంది. వీరు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలవుతున్న తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాల్లో పర్యటించి పథకం అమలుపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. అయితే ఈ కమిటీ అధ్యయనం చేసిందో లేదో ప్రభుత్వమే చెప్పా లి. చీపురుపల్లి నియోజకవర్గంలో 1,02,847 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరంతా ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తుందా అని ఎదురు చూస్తున్నారు.

ఇంకెప్పుడు అమలు చేస్తారు..?



ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి పథకాలకు ప్రభుత్వం బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ఈపథకాలను ఇంకెప్పుడు అమలు చేస్తారో ప్రభుత్వ పెద్దలు చెప్పాలి. అధికారం కోసం ఇష్టారీతిగా హామీలు ఇవ్వడం, ఆతర్వాత వాటిని అటకెక్కించడం సరికాదు. ఏ పథకానికి ఎంత ఖర్చు అవుతుందన్న సంగతి ఎన్నికల్లో హామీ ఇచ్చినప్పుడు చంద్రబాబుకు తెలియదా..?. అధికారం వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని కుంటిసాకులు చెప్పడం సిగ్గుచేటు. కూటమి ప్రభుత్వం మహిళలను మోసం చేసింది.

– బూర్లె పార్వతి, కొర్లాం గ్రామ సర్పంచ్, మెరకముడిదాం మండలం

చేతకాని వారు హామీ ఇవ్వడం ఎందుకు



పథకాలను అమలు చేయడం చేతకానప్పుడు ఇష్టారీతిగా హామీలు ఇవ్వడం ఎందుకు. ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని పక్కరాష్ట్రాలు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులో అక్కడి ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశాయి. ఇక్కడ మాత్రం తొమ్మిది నెలలు గడిచి పోయినా ఇంకా అతీగతి లేదు. బడ్జెట్‌లో ఈ పథకానికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం మహిళలను మోసం చేయడం కాదా..?

– కందుల పార్వతి, వైస్ ఎంపీపీ మెరకముడిదాం మండలం

ఘనంగా ప్రారంభమైన కనకమహాలక్ష్మి జాతర



కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం వద్ద భక్తుల సందడి

చీపురుపల్లి: భక్తులు ఎప్పుడా అంటూ ఎదురు చూసిన చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. జాతర మూడు రోజులు జరగనున్న నేపథ్యంలో బంధువులు, స్నేహితులతో పట్టణంలోని ఇళ్లు, వీధులు, కాలనీల్లో సందడి నెలకొంది. స్థానికుల ఆహ్వానం మేరకు జాతరకు వచ్చిన వారంతా అమ్మవారిని దర్శించుకునేందుకు వెళుతుండడంతో దేవస్థానం ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. పిల్లపేట, గవిడివీధి, కస్పావీధి తదితర ప్రాంతాల్లో ప్రభలు, ఘటాల ఊరేగింపు చేశారు.

తొలిరోజు కార్యక్రమాలు ఇలా జరిగాయి....

జాతరలో తొలిరోజు సాంప్రదాయం ప్రకారం ఉదయం 5 గంటలకు అమ్మవారికి నేత్రోత్సవం నిర్వహించారు.ఉదయం 7 గంటల నుంచి జంగిళ్లతో పాలధారోత్సవం జరిగింది. సాయంత్రం 5 గంటలకు మేళ, తాళాలతో ఊరేగింపుగా ప్రభలు అమ్మవారి ఆలయానికి వెళ్లాయి.



ఊరేగింపుగా జంగిళ్లతో పాలధారోత్సవంలో జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, మహిళలు



ఘటం మోస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీ



జంగిళ్లతో ఊరేగింపుగా ఆలయానికి వెళుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, తదితరులు

ప్రభుత్వ బడిలో చేర్పించండి



బడిఈడు పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని నీలకంఠరాజపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకట రావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు చినగుడిపాల గ్రామంలో శనివారం సాయంత్రం చేశారు. గ్రామంలో అయిదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఆరోతరగతికి తమ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యా యులు ఉన్నారని, మధ్యాహ్న భోజన సదుపాయం ఉందని, ప్రభుత్వం యూనిఫాం, పుస్తకాలు అందిస్తోందని వివరించారు. –వేపాడ

ఎన్‌సీసీ 'ఏ' సర్టిఫికెట్ అర్హత పరీక్ష



చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ 'ఏ'సర్టిఫికెట్ కోసం 3(ఏ)నేవల్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్‌లకు ఆదివారం అర్హత పరీక్ష నిర్వహించారు. 3(ఏ) నేవల్ యూనిట్ పెటీ ఆఫీసర్ అనిల్ కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈపరీక్షకు 53 మంది ఎన్‌సీసీ క్యాడెట్‌లు హాజరయ్యారు.వీరికి రాత పరీక్ష నిర్వహణతో పాటు డ్రిల్ ప్రాక్టికల్ చేయించారు. అర్హత సాధించిన వారికి త్వరలో సర్టిఫికెట్ ప్రధానం చేయనున్నారు.స్థానిక ఎన్‌సీసీ యూనిట్ ఆఫీసర్ మామిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. – చీపురుపల్లి

ఆహార అలవాట్లు మార్చుకోవాలి



ర్యాలీ చేస్తున్న పిరమిడ్ సేవాదళ్ సభ్యులు

బొండపల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ తమ ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం గా ఉండవచ్చని పిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ వి.రామకృష్ణరాజు అన్నారు. శాఖాహారంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ పిరమిడ్ సేవాదళ్ ఆధ్వర్యంలో గొట్లాం గ్రామంలో ఆదివారం ర్యాలీ నిర్వ హించారు. ఈసందర్భంగా రామకృష్ణరాజు మాట్లాడుతూ మాంసాహారాన్ని అతిగా తీసుకోవడం వల్ల అనేక రోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. శాఖాహారం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. అలాగే రోజూ కొంత సమయం ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. పిరమిడ్ సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

అంధకారంలో గరుడుబిల్లి

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి గ్రామంలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ పాడవడంతో రెండు రోజులుగా విద్యుత్ సరఫరా లేక గ్రామం అంధకారంలో మగ్గుతోంది. ట్రాన్స్‌ఫార్మర్‌కు శనివారం మరమ్మతులు చేయించినప్పటికీ మళ్లీ పాడైపోవడంతో గ్రామంలో చీకట్లు అలుముకున్నాయి. ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కావడం, పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గర పడటంతో విద్యుత్ లేక చదువుకునేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సమస్యను విద్యుత్ శాఖ ఏఈఈ ఆర్.శంకరరావు వద్ద సాక్షి ప్రస్తావించగా ట్రాన్స్‌ఫార్మర్‌ను బాగు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించే చర్యలు ప్రారంభించామని ఆదివారం చెప్పారు.

8న మెగాలోక్ అదాలత్



మాట్లాడుతున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

గజపతినగరం: స్థానిక సివిల్ కోర్టులో ఈనెల 8న నిర్వహించనున్న జాతీయ మెగాలోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ కె.లక్ష్మణరావు సూచిం చారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లోక్‌అదాలత్‌లో రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకు వీలైన కేసులు పోలీస్ స్టేషన్ పరిధిలో 30 వరకు ఉన్నాయని చెప్పారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు వాటిని రాజీ చేసేందుకు తమవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న వేదపండితుడు



ఆలయ ధర్మకర్త వెంకటరమణకు విరాళం అందిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల దంపతులు

కొత్తవలస: మండలంలోని ముసిరాం-రామలింగాపురం గ్రామాల మధ్యలో నిర్మించిన ఉత్తరాంధ్ర కనకదుర్గమ్మ(తోటలో దుర్గ మ్మ) ఆలయంలో మూడురోజుల పాటు నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠోత్స వాలు ఆదివారంతో ముగిశాయి.వేద పండితలు అంపోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్త ఏడువాక వెంకటరమణ దంపతులతో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠింపచేశారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, రామ్‌ప్రసాద్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. చుట్టుపక్క గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



తుమ్మికాపల్లిలోని వినాయకనగర్‌కు చెందిన ఫర్‌ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వి.హరికుమార్ ఆధ్వర్యంలో కొత్తవలస మండలంలోని 45 మంది ఒంటరి వృద్ధులకు ఆదివారం 12 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి అతిథులుగా హాజరైన జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, జాతీయ వాలీబాల్ కోచ్ గవర సూరి బాబు, రైల్వే, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు శివాజీ, రామకృష్ణ హాజరయ్యారు. – కొత్తవలస

ప్రైవేట్ ఫిట్‌నెస్ కేంద్రాన్ని ఎత్తివేయాలి



చలో అచ్యుతాపురం వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐఎఫ్‌టీయూ నేతలు

గజపతినగరం: గుర్ల మండలంలోని అచ్యుతాపురంలో ఏర్పాటుచేసిన ప్రైవేట్ ఫిట్‌నెస్ కేంద్రాన్ని వెంటనే ఎత్తివేయాలని విజయదుర్గ ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు అప్పలరాజు రెడ్డి డిమాండ్ చేశారు. ప్రైవేటు ఫిట్‌నెస్ సెంటర్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఈనెల 10న నిర్వహించనున్న చలో అచ్యుతాపురం కార్యక్ర మానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను స్థానిక మెంటాడ జంక్షన్‌రోడ్డులో ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ ఫిట్‌నెస్ సెంటర్లు పెట్టకుండా వెనుకబడిన విజయనగరం జిల్లాలో పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఫిట్‌నెస్ సెంటర్ ఆటోకార్మికులకు గుదిబండలా మారిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచన చేసి డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేసే ఈ ప్రైవేట్ ఫిట్‌నెస్ కేంద్రాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈనెల10న తలపెట్టిన చలోఅచ్యుతాపురం కార్యక్రమానికి ఆటో కార్మికులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఏఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు బాలి సన్యాసిరావు, సభ్యులు, ఆటో కార్మికులు చెన్నా ధర్మారావు, దాలి రాము, నారాయణరావు, లంక రాము, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సెమినార్‌లో ప్రథమ స్థానం



డీఈఓ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థిని కీర్తన

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట జ్యోతిబాపూలే గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన 9వ తరగ తి విద్యార్థిని కశిరెడ్డి కీర్తన జిల్లా స్థాయి సెమినార్‌లో ప్రథమస్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ యు.విజయ్‌కుమార్ పాత్రో ఆదివారం తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం విజయనగరంలో 'ఎంపవరింగ్ ఇండియన్ యూత్ ఫర్ గ్లోబల్ లీడర్‌షిప్ ఇన్ సైన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫర్ వికసిత్ భారత్' అనే అంశంపై శనివారం నిర్వహించిన సెమినార్‌లో కీర్తన ఉత్తమ ప్రతిభ కనబరిచింది. విద్యార్థినిని జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యంనాయుడు, ఇతర అధికారులు చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకుంది. విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.